ప్రజాశక్తి

సోమవారం 18 మార్చి 2024 5 అనంతపురం

నాయకుల విగ్రహాలకు ముసుగులు

రాజకీయ పార్టీల చిత్రాల తొలగింపు

సచివాలయంపై నవరత్నాల చిత్రపటానికి రంగు కొడుతున్న దృశ్యం

ప్రజాశక్తి-నార్పల

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల జెండాలు, ఫొటోలను అధికారులు తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలను తొలగించారు. ఎంపిడిఒ రాముడు మండలవ్యాప్తంగా అన్ని పంచాయితీలలోనూ పర్యటించి కార్యదర్శులు, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో రాజకీయ పార్టీలు, జెండాలు, పోస్టర్లను తీసివేయించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జూన్ నెలాఖరు వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాల్సిందేనన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నాడు ప్రత్యర్థులు.. నేడు 'కూటమి' మిత్రులు

రసవత్తరంగా రాయదుర్గం రాజకీయాలు

'కాలవ'కు 'కాపు' సహకరించేనా..?

ప్రజాశక్తి - రాయదుర్గం

రాజకీయాల్లో శాశ్వత శతృత్వం కాని, మిత్రుత్వం కాని ఉండదంటారు. అందుకు సరిగ్గా రాయదుర్గం రాజకీయాలు సరిపోలాయి. రెండు నెలల క్రితం వరకు మాజీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ప్రస్తుత ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రాజకీయ ప్రత్యర్థులు. ఒకరు టిడిపికి చెందిన వారు కాగా, మరొకరులు వైసిపికి చెందిన వారుగా ఉండేవారు. వైసిపి తరుపున ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా కొనసాగిన కాపు రామచంద్రారెడ్డి ఇదివరకు దాదాపు ప్రతినిత్యం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును విమర్శించని రోజు ఉండేది కాదు. ఆయన కూడా అంతేస్థాయిలో కాపు రామచంద్రారెడ్డిపై విమర్శలు చేసేవారు. ఎప్పుడైతే వైసిపి తరపున కాపు రామచంద్రారెడ్డికికి టికెట్ ఇవ్వడం లేదని తెలిసిందో ఆ రోజే ఆయన ఆ పార్టీకి గుడ్‌బై కొట్టేశారు. రాయదుర్గం,కళ్యాణదుర్గం తనకు రెండు కళ్లు అని ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు తాను, తన కుటుంబ సభ్యులు, మిత్రులు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఇండిపెండెంట్‌గా లేదా పార్టీల తరఫున పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు. పార్టీ టికెట్లపై శతవిధాల ప్రయత్నించారు. కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి, షర్మిలను కలిశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, బిజెపి నాయకులు జెపి నడ్డా, పురందరేశ్వరిని కలిశారు. ఈ నేపథ్యంలో కాపు శనివారం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఇటు అసెంబ్లీ అటు లోకసభ ఎన్నికలలో 'కాపు' పోటీ చేసే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంలో అసెంబ్లీ, లోకసభ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పొత్తు పెట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఈ కూటమి తరపున పోటీ చేసే అభ్యర్థులకు ఈ మూడు పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలపాల్సిన అవసరం ఉంది. ఈ కూటమి తరపున రాయదుర్గం నుండి అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఎన్నికల బరిలో ఉన్నారు. రాయదుర్గం ప్రాంతానికి చెందిన కాపు రామచంద్రారెడ్డికి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో మిత్రపక్షం అభ్యర్థి కాలవ శ్రీనివాసులును గెలిపించాల్సిన బాధ్యత ఉంది. గతంలో నిత్యం కాలవపై నిప్పులు చెరిగిన కాపు రామచంద్రారెడ్డి ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో ఆయనకు ఏ విధంగా మద్దతు ఇస్తారో అనిస్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాపు రామచంద్రారెడ్డి వెంట అనుచరులుగా ఉన్న అనేకమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి మెట్టు గోవింద్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అయితే వారిలో మరికొందరు ఇప్పటికీ కాపు వెన్నంటే ఉన్నారు. మరి వారంతా వైసిపికి కాకుండా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశం ఉందా అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఉద్యోగాల పేరిట కుచ్చుటోపీ..!

నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చి టోకరా

గుత్తిలో కార్యాలయం ఏర్పాటు చేసి రూ.1.60 కోట్లు వసూలు

ఎస్పీని ఆశ్రయించనున్న బాధితులు

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి గుత్తిలో రూ.కోట్లు వసూలు చేసిన దంపతులు తమ కార్యాలయ బోర్డు తిప్పేసి హైదరాబాదుకు ఉడాయించిన ఘటన అనంతపురం జిల్లా గుత్తిలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ భాగోతం గురించి బాధితులు తెలిపిన వివరాలు...



ELEMENTS	Amount in INR
Basic Pay	18,750.00
House Rent Allowance	9,375.00
Special Allowance	9,375.00
Transport Allowance	5,000.00
Telephone Allowance	1,000.00
Stationary Allowance	1,375.00
Medical Allowance	2,000.00
Gross Salary	37,500.00
Statutory Deductions	
PF	2,250.00
ESIC	[illegible]
Net Payable	35,250.00
Monthly Gross	37,500.00
Annual Gross	450,000.00

నకిలీ ఉద్యోగ నియామక పత్రం

ప్రజాశక్తి గుత్తి

గుత్తి పట్టణం శివారులోని కర్నూలు రోడ్డులో గల ఓ కాలనీలో రాణి నాగేశ్వరి, సాయి దుర్గాప్రసాద్ అనే దంపతులు ఓ గది అద్దెకు తీసుకుని ఎమ్ఎస్. సొల్యూషన్స్ (జాబ్ కన్సల్టెన్సీ) పేరు మీద కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తమ ప్రధాన కార్యాలయం హైదరాబాదులో ఉందని నమ్మబలికారు. వాట్సాప్ గ్రూప్‌ను తయారు చేసి నిరుద్యోగ యువకులను ఆకర్షించేందుకు పలు కంపెనీల సంబంధించిన కార్యాలయాల వీడియోలను పోస్ట్ చేసేవారు. పలువురు ఉద్యోగాలు చేస్తున్నట్లు వీడియోలు చేసి వాట్సాప్‌లో సెండ్ చేసేవారు. నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌తో పాటు వివిధ ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించారు. ఉద్యోగాలకు అవసరమయ్యే విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను నకిలీవి వారే సృష్టించేవారు. అంతేకాకుండా వివిధ కళాశాలలకు చెందిన ఫేక్ సర్టిఫికెట్లు కూడా తయారు చేసేవారు. కొంతమంది నిరుద్యోగులతో మాట్లాడి వారి బయోడేటాను తామే కంపెనీలకు పంపించామని చెప్పేవారు. ఈ నేపథ్యంలో ఉద్యోగం వస్తుందని ఆశతో మండలంలోని చెర్లోపల్లి కాలనీ చెందిన జి.మోహన్‌కృష్ణ అనే యువకుడు వారిని ఆశ్రయించాడు. ఉద్యోగం ఇప్పిస్తామని రాణి నాగేశ్వరి, సాయి దుర్గాప్రసాద్ ఆ యువకుడిని నమ్మించారు. దీంతో మోహన్‌కృష్ణ తల్లిదండ్రులు వడ్డీకి అప్పుచేసి రూ.3.35 లక్షలు ఇచ్చారు. దీంతో మోహన్‌కృష్ణ రూ.50 వేలు ఫోన్ పే ద్వారా, రూ. లక్ష హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా వారి అకౌంట్‌కు చెల్లించాడు. మరో లక్ష రూపాయలు కార్యాలయానికి వెళ్లి ఇచ్చాడు. మిగిలిన రూ. 85వేలు ఇంటి వద్దకు వెళ్లి రాణినాగేశ్వరికి చెల్లించాడు. దీంతో ఆ యువకుడికి నకిలీ ఉద్యోగ ధ్రువీకరణ పత్రం, ఐడి కార్డు, తక్కువ ధర గల ల్యాబ్ టాప్ ను అందజేసిన ఆ దంపతులు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని నమ్మించారు. వార్షిక వేతనం రూ.4.50లక్షలు అని చెప్పారు. ఐదు నెలల పాటు ఆ యువకుడిని ప్రతినెలా రూ.16వేలు చొప్పున వెబ్‌నెట్ ఇన్ఫోసెస్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరు మీదుగా ఎమ్ఎస్. సొల్యూషన్స్ నిర్వాహకులే వేతనంగా చెల్లించారు. కంపెనీకి పోయి ఉద్యోగం చేసినప్పుడు నెలకి రూ.35వేలు వేతనం వస్తుందని నమ్మించారు. అయితే ఐదు నెలలుగా ఆ యువకుడికి వేతనం రాలేదు. దీంతో ఆ యువకుడి అనుమానం వచ్చి రాణి నాగేశ్వరిని, సాయి దుర్గాప్రసాద్‌ను అడిగాడు. దీంతో వారు తమకు సంబంధం లేదని కంపెనీ వారిని అడగాలని అన్నారు. చేసేదిలేక మోహన్‌కృష్ణ వెబ్‌నెట్ ఇన్ఫోసెస్ కంపెనీ ఎక్కుడుందని ఆరా తీశాడు. సికింద్రాబాద్ శివారులో ఉందని చెప్పడంతో అక్కడి వెళ్లి ఆరా తీయగా అది ఫేక్ కంపెనీ అని తేలింది. దీంతో ఆ యువకుడు రాణినాగేశ్వరిని, సాయి దుర్గాప్రసాద్‌ను నిలదీశాడు. దీంతో వారు బేరసారాలకు దిగినట్లు తెలుస్తోంది. ఇలా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరితో రూ.2 లక్షలు నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేసుకుని నకిలీ ఉద్యోగ నియమాక పత్రాలను అందజేసినట్లు సమాచారం. ఇలాగే గుత్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు ఉద్యోగం కోసం రూ.2 లక్షల చెల్లించాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు సంబంధించి 86 మంది తమకు ఉద్యోగాలు వస్తాయని ఆశతో డబ్బు ఇచ్చి మోసపోయారు. వీరందరి వద్ద నుంచి సుమారు రూ.1.60 కోట్లు వసూలు చేసుకుని మోసం చేసినట్లు సమాచారం. ఇటీవల వీరు గుత్తిలో ఉన్న తమ కార్యాలయం బోర్డు తిప్పేశారు. తమకు జరిగిన అన్యాయంపై బాధిత యువకులు వారిని డబ్బులు చెల్లించాలని రాణి నాగేశ్వరి, సాయిదుర్గాప్రసాద్‌కు ఫోన్ చేస్తుండటంతో వారు బెదిరిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. తాము ప్రజా ప్రతినిధులతో దిగిన ఫోటోలను బాధితులకు వాట్సాప్ లో పెట్టి బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అందరూ తెలుసు అని ఏం చేసుకుంటారో చేసుకోండని ఇలా చేస్తే ఇంటికి వచ్చి చావకొడతామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. తమకు జరిగిన మోసంపై తాము పోలీసులను ఆశ్రయించనున్నట్లు బాధితులు తెలిపారు. గతంలో వీరు కర్నూలులో కూడా ఇలాగే కార్యాలయం ఏర్పాటు చేసి నిరుద్యోగులను మోసం చేసినట్లు సమాచారం.

నేటి నుంచి 'పది' పరీక్షలు

142 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 40,063మంది విద్యార్థులు - జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి

వివరాలు వెల్లడిస్తున్న డీఈవో వరలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం

ఏపీ విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా సోమవారం నుంచి ఈనెల 30వ తేదీవరకు పదవతరగతి పరీక్షలు ఉదయం 9.45 నుంచి 12.45 గంటలు మధ్య నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 పదవ తరగతి పరీక్షలు జిల్లాలో 40063 మంది విద్యార్థులు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 142 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గతంలో మాదిరిగా గాకుండా మండల విద్యాశాఖ అధికారినే ఎగ్జామినేషన్ ఆఫీసర్‌గా నియమించామన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు వారే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు జరిగే కేంద్రాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించి ఎండ తీవత నేపథ్యంలో పరీక్ష హాల్‌లో లైట్లు, ఫ్యాన్లు మట్టి కుండల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని చెప్పామన్నారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఎండల తీవత నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో పరీక్ష కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేయాలని కోరామన్నారు. పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్ చూపిస్తేఉచితంగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎపిఎస్ఆర్‌టిసి వారిని కోరామన్నారు. పరీక్ష ప్రశ్నా పత్రాలు లీకేజీకి ఆస్కారం లేకుండా డిజిటిలైజేషన్ చేశామన్నారు. ప్రతి విద్యార్థికి అందజేసే ప్రశ్నా పత్రంపై సీరియల్ నెంబర్ ఉంటుందని ప్రశ్నా పత్రం లీకేజీ అయితే ఏ సెంటర్ నుంచి జరిగిందో వెంటనే తెలుస్తోందని అన్నారు. పరీక్షలకు సంబందించి విద్యార్థులు, సెంటర్‌నిర్వాహకులకు ఏమైనా సందేహాలుంటే 9441575778 హెల్ప్ లైన్ సెంటర్ కు సంప్రదించాలని కోరారు.

పకడ్బందీగా ఎంసిసి అమలు : కలెక్టర్

విడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

2024 సార్వత్రిక ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణకు మాడల్ కండక్ట్ ఆఫ్ కంట్రోల్ (ఎంసిసి)ను పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఆదివారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల సంసిద్ధత, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి సమీక్షించారు. ఎన్నికల కోసం అన్ని విధాలా సంసిద్ధత ఎంతో కీలకమైనదన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ (ఎంసిసి) అమలుపై ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎంసిసి, ఎఫ్ఎస్‌టీ టీమ్ లు క్షేత్రస్థాయిలో చురుగ్గా పని చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫోటోలను, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డు కిరువైపులా, మీటింగ్ ప్రాంతాల్లో అన్ని హోర్డింగులను తక్షణమే తొలగించేలా రిటర్నింగ్ అధికారులు సంబంధిత ఏఆర్వోలు, ఎంపిడిఒలతో మాట్లాడాలన్నారు. ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన అదే రోజు రిపోర్టును అందించాలన్నారు. సీవిజిల్ యాప్‌ను మరింత బలోపేతం చేయాలని, యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాలలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాలంటీర్లు ఎక్కడైనా రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటే వారిని సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలు తప్పనిసరిగా పాటించి ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, రాణి, సుస్మిత, కరుణ కుమారి, వసంతబాబు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, నోడల్ అధికారులు వీర్రాజు, అప్పాజీ, భాస్కర్, చౌదరి, తహశీల్దార్ శివరామిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్- 1 పరీక్షలు

పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. గ్రూప్-1 పరీక్షల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్షల కోసం 33 మంది లైజన్ ఆఫీసర్‌లు (సీనియర్ జిల్లా స్థాయి అధికారులు)ను నియమించామని చెప్పారు. ఉదయం మొదటి సెషన్ పరీక్షలకు 11,597 మంది అభ్యర్థులకు గాను 7,542 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం రెండో సెషన్ పరీక్షలకు 11,597 మందికి గాను 7,459 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా, ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయన్నారు. అందుకు సహకరించిన జిల్లా యంత్రాంగాన్ని ఆమె అభినందించారు.

గ్రూప్ - 1 పరీక్షలను పరిశీలించిన కమిషనర్

నగరంలోని గుత్తి రోడ్‌లో ఉన్న శ్రీసాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్, బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న గ్రూప్ - 1 పరీక్షలను నగర పాలక సంస్థ కమిషనర్, ఏపీపీఎస్సీ గ్రూప్-1 సర్వీసెస్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ మేఘ స్వరూప్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న తీరును ఆరా తీశారు.

పటిష్ట బందోబస్తు

అనంతపురం క్రైం : నగరంలో నిర్వహించిన ఎపిపిఎస్‌సి గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఇందులో భాగంగా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎపిపిఎస్‌సి గ్రూప్-1 సర్వీసెస్ స్క్రీనింగ్ పరీక్ష కోసం నగరంలో 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటు బందోబస్తును అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల్లో కి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, పుస్తకాలు అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు.

వామపక్ష కూటమిని గెలిపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య

ప్రజాశక్తి-గుంతకల్లు

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన ఓడించి వామపక్షాల కూటమిని గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాల రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు కాలనీలో సిపిఎం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి దేశంలో రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. రాష్ట్రంలో కూడా టిడిపి, వైసిపిలు బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా రాష్ట్రంలో రెడ్ కార్పొరేట్ పరిచి ఆ విధానాలను అమలు చేయడం ద్వారా ప్రజలు అనేక సమస్యలకు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగసంస్థలు, మన రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలపై నిలదీయకుండా బీజేపీకి దాసోహం అయ్యారన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలు, రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేసే వారికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి కూటమిని ఓడించడానికి ప్రజలందరూ ఏకం కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి అభ్యర్థి, రాజకీయ పార్టీ ప్రతినిధీ సభలు, సమావేశాలు, వాహనాలు అన్నీ ముందస్తు అనుమతి పొంది నిర్వహించుకోవాలని తెలిపారు. మసీదులు, చర్చిలు, ఆలయాలు, ఇతర ప్రార్థన స్థలాల్లో మరియు విద్యా సంస్థలలో ఎన్నికల ప్రచారం చేయకూడదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం చేయకూడదని, ఎన్నికల ప్రచారానికి వినియోగించే ప్రతి వాహనానికీ ఎన్నికల నిబంధనల ప్రకారం వెహికల్ పరిమిషన్ తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల కార్యకర్తలు 50 వేలకు మించి నగదు, 10 వేల కన్నా ఎక్కువ విలువైన వస్తువులను రవాణా చేయటం నిషిద్ధమన్నారు. పార్టీల స్టార్ క్యాంపెయినర్లు రూ.లక్షకు మించి నగదు కలిగి ఉంచుకోకూడదన్నారు. పరిమితికి మించి నగదు రవాణా చేస్తున్న వాహనాలను కూడా ఆ నగదుతోపాటే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సెంట్రల్ వర్సిటీ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ - వర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి మంజూరైన సెంట్రల్ యూనివర్శిటీ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏపి సెంట్రల్ యూనివర్శిటీ ఎస్ఎఫ్ఐ 2వ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ విభజన హామీల్లో భాగంగా సెంట్రల్ యూనివర్సిటీని అనంతపురం జిల్లాకు కేటాయించారన్నారు. అయితే వర్సిటీ మంజూరు చేసి పదేళ్లు కావస్తున్నా సొంత భవనాలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. బుక్కరాయసముద్రంలోని జంతలూరు వద్ద కేవలం శిలాఫలకానికి మాత్రమే పరిమితమైన సెంట్రల్ యూనివర్సిటీ ప్రభుత్వాలు మారుతున్నా పాలకులు పట్టించుకోలేదన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి దాదాపు ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్న ఆసౌకర్యాల మధ్య చదువులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం విద్య పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదన్నారు. క్యాంపస్ ప్రయివేటు కాలేజీల్లో నిర్వహిస్తూ మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంగా సెంట్రల్ యూనివర్సిటీలో అనేక ఉద్యమాలను నిర్వహిస్తోందన్నారు. పోరాటం నేపథ్యంలో నిర్దాక్షిణ్యంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థులను నెల రోజుల పాటు సస్పెండ్ చేశారని, అయినా కూడా ఎక్కడా తగ్గకుండా సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ యూనివర్సిటీ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అలుపెరుగని పోరాటం ఎస్ఎఫ్ఐ చేస్తుందన్నారు. 21 మందితో ఆంధ్ర ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా జినిత్ లాల్, అధ్యక్షునిగా బాబు రాజ్, ఉపాధ్యక్షులుగా తీర్థా, సూర్యవంశీ, సహాయ కార్యదర్శులుగా అభిషేక్, వంశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కవాతు నిర్వహిస్తున్న సాయుధ దళాలు

నార్పలలో సాయుధ దళాల కవాతు

నార్పల : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలు ఆదివారం మండల కేంద్రంలో కవాతు నిర్వహించాయి. బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ధర్మేందర్‌సింగ్, సిఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకూ ప్రధాన రహదారి గుండా కవాతు సాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కవాతు నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ప్రజల్లో ఉన్న భయాం దోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO:280/2022
Between:
బి.నాయుడు ...వాది
మరియు
పెండ్యాల ప్రసాద్ నాయుడు died by L.Rs
పెండ్యాల సరస్వతి W/o Late పి. ప్రసాద్ నాయుడు
పెండ్యాల తేజేశ్వర నాయుడు
పెండ్యాల దీక్షిత ...ప్రతివాదులు
D1 to D2 Are R/o ప్లాటు నెంబరు 502, గరుడ అపార్టుమెంట్, అనంతపురం టౌన్ మరియు జిల్లా.
1,2,3 ప్రతివాదులకు దావా సమన్సు
పై దావాలో వాది తన ప్రొనోటు బాకీ మొత్తమును రాబట్టుకొను నిమిత్తము ప్రతివాది వారసులైన మీ పైన దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో మీ హాజరు నిమిత్తము కోర్టు వారు 04/04/2024 వ తేదిన వాయిదా వేసి యున్నారు. పై విషయంలో మీకు అభ్యంతరాలు ఉన్న యెడల పై తేదిన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
చింతా రమేష్‌నాథరెడ్డి,
కళ్ళమడి శంకరరెడ్డి,
దాసరి శివరామకృష్ణ
వాదితరుపు న్యాయవాదులు, తాడిపత్రి.

IN THE COURT OF THE SPL. JFCM FOR TRAIL OF CASE UNDER A.P PROHIBITION AND EXCISE ACT-CUM III ADDL. JUNIOR CIVIL JUDGE:ANANTHAPURAMU
O.S. No: 249/2020
Between:
Ganesh ...Plaintiff
V/S
Smt.K.Naseema Bhanu ...Defendant
Smt.K.Naseema Bhanu D/o Silav Khan, Junior Assistent O/o K.S.R. Govt.Junior Collage, Ananthapuramu Sity & Dist.
ప్రతివాదికి దావా సమను
పై దావాలో వాది తన దావా బాకీ రాబట్టు నిమిత్తము మీ మీదా పై దావా దాఖలు చేసి యున్నారు. పై దావా నీ యొక్క హాజరు కొరకు వాయిదా 18/03/2024 వ తేదికి వాయిదా వేయబడినది. కావున నీకేమైనా ఆక్షేపణలున్న యెడల పై తేదిన ఉదయం 10:30 గం॥లకు పై కోర్టు నందు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల దావా నీ పరోక్షమునందు తీర్మానం చేయబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
ఎన్.యు.దేవనాథ రెడ్డి, బి.యస్సీ., ఎల్.ఎల్.బి,
వాదితరుపు వకీలు, తాడిపత్రి.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE GOOTY
E.P 09/2020 in O.S 54/2017
Between:
Sripathi Venugopala Achari ...Decree Holder
And
Pinni @ Pinnivaru Nagendra Prasad ...Judgement Debtor
TO:
JUDGEMENT DEBTOR
Pinni @ Pinnivaru Nagendra Prasad , S/o late P.Venkataramaiah, Hindu, major, aged about 47 years, D.No 5/29, Dhabada Veedhi. Pamidi town and mandal, Anantapur district.
Where as the Decree holder has instituted a petition against you for attachment of the amount lying in C.C.D ofJunior Civil Judge's Court, Gooty in E.P 93/2017 in O.S 40/2017 on the file of Junior Civil Judge, Gooty belong to you U/O 21 Rule 22 & 52 C.P.C basing on the decree, You are here by noticed U/O 21 Rule 52 C.P.C to appear in this cowl in person or pleader duly instructed and able to answer all material question relating to the execution petition on 21/03/2024 at 10:30 A.M in the fore noon and that in default of your appearance on the lore said day, the above execution petition will be heard and determined in your absence.
N.Md. Ismail,M.A.B.L.,
Advocate for Decree holder .

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE GOOTY
E.P 12/2020 in O.S 57/2017
Between:
Oruganti Satyanarayana ...Decree Holder
And
Pinni @ Pinnivaru Nagendra Prasad ...Judgement Debtor
TO:
JUDGEMENT DEBTOR
Pinni @ Pinnivaru Nagendra Prasad , S/o late P. Venkataramaiah, Hindu, major, aged about 47 years, D.No 5/29, Dhabada Veedhi, Pamidi town and mandal, Anantapur district.
Where as the Decree holder has instituted a petition against you for attachment of the amount lying in C.C.D of Junior Civil Judge's Court, Gooty in E.P 93/2017 in O.S 40/2017 on the file of Junior Civil Judge, Gooty belong to you U/O 21 Rule 22 & 52 C.P.C basing on the decree. You are here by noticed U/O 21 Rule 52 C.P.C to appear in this court in person or pleader duly instructed and able to answer all material question relating to the execution petition On 21/03/2024 at 10:30 A.M in the fore noon and that in delitult of yoUr appearance on the fore said day, the above execution petition will be heard and determined in your absence.
N.Md. Ismail, M.A.B.L,
Advocate for Decree holder

లాభాల బాటలో పట్టణ బ్యాంకు

చైర్మన్ ఎస్.అబ్దుల్‌జిలానీ

ప్రజాశక్తి-గుత్తి

షేర్ హోల్డర్లు, డైరెక్టర్లు, సిబ్బంది సహకారంతో ది గుత్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందని బ్యాంకు చైర్మన్ ఎస్.అబ్దుల్ జిలానీ తెలిపారు. ఆదివారం పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. తమ బ్యాంకు ఏపీలోని అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. పామిడిలో నూతనంగా బ్రాంచ్‌ని ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని బ్రాంచులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు రాము, డైరెక్టర్లు కె.నాగరాజు, కృష్ణ, వీరన్న, మధుసూదన్‌గుప్తా, మాబు, సీఈవో ఎస్.మహేశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాంకులకు దీటుగా అర్బన్ బ్యాంకు సేవలు

108వ మహాజన సభలో చైర్మన్ జెఎల్ మురళీధర్

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ బ్యాంకులకు దీటుగా అర్బన్ బ్యాంకు సేవలు అందిస్తోందని బ్యాంకు చైర్మన్ జెఎల్ మురళీధర్ తెలిపారు. ఆదివారం నగరంలోని అర్బన్ బ్యాంకులో 108వ మహాజన సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఏర్పడి నేటికు 16 నెలల పూర్తయిందన్నారు. 16నెలల కాలంలో పాలకవర్గం, సిబ్బంది బ్యాంకు ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారన్నారు. 2024-25 కాలంలో బ్యాంకు ఎన్‌పిఎ శాతం 6.19 నుంచి 2.10 వరకూ తగ్గించామన్నారు. ప్రస్తుతం రూ.86కోట్లు ఉన్న డిపాజిట్లను రూ.120 కోట్లు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బ్యాంకును ప్రజల్లోకి మరింత చేరువ చేసి అనేక రుణాలు మంజూరు చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రస్తుత కాలంలో కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడుతూ బ్యాంకులో నూతనంగా ఆన్‌లైన్ సర్వీసులను ప్రారంభించామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అనేక సొసైటీలు అంతరిస్తున్న తరుణంలో అనంతపూర్ అర్బన్ బ్యాంకు మాత్రం డిపాజిట్‌దారులు, ఖాతాదారుల నమ్మకాన్ని చూరగొందన్నారు. అనంతరం నెలనెలా కంతులు కట్టే వారిని, డిపాజిటర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు వడ్డే వెంకటాద్రి, ఎస్.బాషా, డైరెక్టర్లు జంగంశెట్టి రామాంజనేయులు, రొళ్ల భాస్కర్, వి.జి.సుబ్రమణ్యం, బావిగడ్డ రమణయ్య, మాగిశెట్టి చంద్రశేఖర్, చింతా భాస్కర్, బ్యాంకు సిఇఒ ఎం.విజయభాస్కర్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, రుణగ్రస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ జెఎల్ మురళీధర్

'గీతలు చెడిపి' కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రసిద్ధ కథ నవలా రచయిత డాక్టర్ శాంతి నారాయణ రచించిన 'గీతలు చెడిపి' కథా సంపుటి పుస్తకాన్ని ఆచార్య రాజుపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతనఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ డాక్టర్ శాంతి నారాయణ రచనలు ఎంతో స్ఫూర్తిని సామాజిక కోణాల్ని భావవ్యక్తీకరణలను ఆధునిక సామాజిక భావాలను వ్యక్తపరిచే రీతిలో ఉంటాయని కొనియాడారు. సామాజిక దక్పథం ఉన్న శాంతి నారాయణ కలం నుండి మరిన్ని ఆవిష్కరణలు జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ కథ సంపుటిని అరుణాదేవి, శ్రీనివాసరెడ్డి దంపతులు స్వీకరితలుగా ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వీక్షణం మాసపత్రిక వ్యవస్థాపక సంపాదకులు వేణుగోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బండి నారాయణస్వామి, జనప్రియ కవి ఏలూరి వెంకన్న, సడ్లపల్లి చిదంబరరెడ్డి, ఉప్పలపాటి వెంకటేశులు, తూముచెర్ల రాజారాం, గోసల నారాయణస్వామి, కొత్తపల్లి సురేష్, ఎఎ నాగేంద్ర, దాసరి ఆదినారాయణ, కోటిగారి వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

'గీతలు చెడిపి' కథా సంపుటి ఆవిష్కరిస్తున్న వక్తలు

ఐఎన్‌టిఎస్ఒ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయదుందుభి

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య ఎజిఎం సుబ్బారెడ్డి

ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్ 2వ లెవెల్ పరీక్ష ఫలితాల్లో అనంతపురం జోన్‌కు చెందిన శ్రీచైతన్య విద్యార్థులు విజయదుందుభి మోగించినట్లు విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆదివారం నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం-సి, ఎం-బ్యాచ్ డేస్ కలర్ క్యాంపస్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఐఎన్‌టిఎస్ఒ రెండవ లెవెల్లో ఎటిపి-3కి చెందిన బి.నవదీప్, ఎటిపి-1కి చెందిన టి.చరిత, సిబిఎస్ఇకి చెందిన పూర్వజ్ రామ్, కళ్యాణదుర్గం బ్రాంచికి చెందిన మనస్విని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ విజయానికి తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, షమీనాఖాన్, తబసుమ్, వెంకటేష్, శాంత, పర్వీన్‌భాను, నేత్రావతి, ఈర్షద్, శ్రీదేవి, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణ్, డీన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధి వైద్యశిబిరానికి స్పందన

రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

అనంతపురం కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మూర్ఛవ్యాధి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి, కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. జెవివి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఎక్కువ సంఖ్యలో దాదాపుగా 106 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారని తెలిపారు. డాక్టర్ ప్రసూన, డాక్టర్ హరి కిషోర్‌లు వ్యాధి నయం కోసం రోగులకు వైద్యం చేయడంతో పాటు అనేక సలహాలు సూచనలు అందించినట్లు వారు తెలిపారు. మూర్ఛవ్యాధిగ్రస్తులు చాలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, రాధాకృష్ణ, ఎర్రిస్వామి, శివచరణ్, నూర్ మహమ్మద్, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెద్దవడుగూరు : నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 555 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందుకుగాను రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు.

గార్లదిన్నె : నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒ తారాచందానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 572 మంది రెగ్యులర్, 311 మంది ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టాలి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రచారం చేస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

ఐదేళ్లలో ప్రతి ఇంటికీ సంక్షేమం అందించిన వైసిపి ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి ఎం.శంకర్‌నారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని తిమ్మాపురం, శనగలగూడూరు, గాండ్లపాడు, తక్కళ్లపల్లి, పుట్లూరు, పి.చింతలపల్లి, గోపరాజుపల్లి, సి.వెంగన్నపల్లి, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, చింతకుంట, కందికాపుల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి వైసిపి జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జగనన్న పరిపాలనలో అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించామన్నారు. 2019 లో అధికారంలోకి వచ్చిన జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడటంతో ప్రతిపక్ష పార్టీలు ఇళ్ల వద్దకు వచ్చి మోస మాటలు చెబుతాయని నమ్మవద్దన్నారు. ఎన్నికల్లో ఓటుతో ఆ పార్టీలను ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రమేష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంపిపి రాఘవరెడ్డి, ఎస్.గూడూరు ఎంపిటిసి బి.నాగార్జునరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లాయర్ భాస్కర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమాన సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

మహిళకు నమస్కరిస్తున్న టిడిపి నాయకులు

గుత్తి : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, నారాయణ, ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని కరిడికొండ గ్రామంలో గుమ్మనూరు జయరామ్ సోదరులు, కుమారుడు ఆధ్వర్యంలో ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. తర్వాత మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు సిఎం అయితేనే పట్టణాలతోపాటు గ్రామీణా ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుమ్మనూరు జయరామ్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రవితేజ, నారాయణ, స్వామి, రవితేజ, ప్రభాకర్‌నాయుడు, గిరి, వేణు, సుధాకర్, పిల్లేల్లి క్రిష్ణయ్య, పి.ప్రభాకర్, శ్రీరాములు, న్యాయవాది సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.
ఫోటోలుజి

శ్రావణిశ్రీని గెలిపించుకుంటాం

టిడిపి సీనియర్ నాయకులు చిదానందనాయుడు

ప్రజాశక్తి-శింగనమల

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు చిదానందనాయుడు

భారీ మెజారిటీతో బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుంటామని టిడిపి సీనియర్ నాయకులు చిదానందనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న, చిన్న మనస్పర్థలు ఉన్నా పక్కన పెట్టి తమ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని గెలిపించుకుంటామన్నారు. ముఖ్యంగా అరాచక వైసీపీ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో అభివద్ధి జరగాలన్నా.. యువతకు ఉద్యోగాలు రావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏది ఏమైనా రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి నియోజకవర్గంలో శ్రావణిని ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో చంద్రబాబును సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల రాము, వలి, పోకూరి శ్రీనివాసులు, కొర్రపాటి కృష్ణమూర్తి, జూలాకాలువ సుధీర్, కూచే మురళి, తలారి జగ, బొగ్గు పెద్దన్న, సోము, రంగప్ప, సంజీవరాయుడు, ఎంపిటిసి అభ్యర్థి అంజనమ్మ, వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

అనంతపురం : ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అనంతపురం రియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మోదుపల్లి ఉదయ్‌కుమార్ పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించారు. అధికసంఖ్యలో ప్రజలు వైద్యుల సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో రియా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మోదుపల్లి లక్ష్మీప్రసాద్, సీఈఓ మురళీకృష్ణ, ఆలయ ధర్మకర్తలు, ఇఒ శోభారాణీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీకు మేలు చేసిన ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం విడపనకల్లు మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా హజరత్ షేక్ బడేషావలి ఖాద్రీ దర్గాలో స్వామివారి సమాధికి ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ మరోసారి మీకు మేలు చేసిన ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, హనుమంతు, తిప్పయ్య, తిమ్మరాజు, హనుమంతు, భరత్‌రెడ్డి, సుంకన్న, గిరిబాబు, కుళ్లాయిస్వామి, సుశీలమ్మ, రాఘవేంద్ర, ముద్దప్ప, వలిబాషా, వీరప్ప, రోజా, చిట్టిబాబు, కేసన్న, ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'అడ్డపల్లకి' గ్రామోత్సవం

పల్లకిలో ఊరేగిన గవిమఠం 8వ పీఠాధిపతి

ప్రజాశక్తి-ఉరవకొండ

అడ్డపల్లికి ఉత్సవంలో పాల్గొన్న స్వాములు

ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందిన పట్టణంలోని గవిమఠం శ్రీస్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం 'అడ్డపల్లకి' ఉత్సవం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా పట్టణంలోని వెలిగొండ రహదారిలో ఉన్న విడిది మఠంలో పీఠాధిపతి శ్రీచెన్నబసవ రాజేంద్ర స్వాములకి మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, అర్చకులు ప్రత్యేక పాదపూజ చేశారు. అనంతరం స్వాముల వారిని పల్లకిలో కూర్చోబెట్టి పురవీధుల గుండా మేళతాళాలు, సంప్రదాయ నృత్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా కర్నాటక రాష్ట్రానికి చెందిన కళాకారుల తాళాల నృత్యం, వీరభద్ర వేషధారి నాట్యం పలువురిని ఆకట్టుకుంది. డప్పు వాయిస్తూ కళాకారులు చేసిన నృత్యాలు చూపరులను కట్టిపడేసాయి. ఉత్సవంలో గవిమఠం గజలక్ష్మి (ఏనుగు) ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకీమఠం పీఠాధిపతి కల్యాణిస్వామి, మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, వీరశైవ సంఘం నాయకులు పాల్తూరు శంకర్, మఠం సిబ్బంది నారాయణస్వామి, రఘురాములు, మధు, వెంకటేశులు, ప్రత్యేక సిబ్బంది శంకర, గోపీ, భక్తులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పొలం వద్ద రైతుల ఘర్షణ

ద్విచక్ర వాహనానికి నిప్పు

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో పొలం వద్ద విద్యుత్ స్తంభం విషయమై శనివారం రాత్రి రైతులు గొడవ పడ్డారు. దీంతో మాటామాటా పెరిగి బైక్‌కు నిప్పు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే... గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు నల్లప్ప, రామాంజనేయులు, మరో రైతు పూజారి పెద్ద రాజన్న, తదితరులు గొడవపడ్డారు. గొడవలో మాటామాటా పెరిగి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నల్లప్ప, రామాంజనేయులకు గాయాలు అయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఇంటి వద్దన ఉన్న మోటార్ బైక్‌కు నిప్పు పెట్టగా పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో గ్రామానికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారు నగల అపహరణ

గుత్తి : ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి ఓ ప్రయాణికురాలి బంగారు నగలను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. గుంతకల్లు చెందిన జయలక్ష్మి పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి వెళ్లింది. అనంతరం స్వగ్రామానికి వెళ్లడానికి గుత్తి బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కింది. ఆ సమయంలో బ్యాగులో ఉన్న తన ఏడు తులాల బంగారు ఆభరణాలను దుండగులు చోరీ చేశారు. బాధితురాలు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

టిడిపి గెలుపునకు కృషి చేయాలి : జెసి

పుట్లూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఒక్కరూ టిడిపి అభ్యర్థిని గెలిపించి చంద్రబాబును సిఎం చేసేందుకు శాయశక్తులా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, సంజీపురం పవన్‌కుమార్‌రెడ్డి, బాలాపురం రామచంద్రారెడ్డి, తాజ్, రామచంద్రనాయుడు, శ్రీనివాసనాయుడు, మల్లికార్జునరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విజయభాస్కర్

రాయదుర్గం : పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డి.విజయభాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న విజయభాస్కర్ పదోన్నతిపై శనివారం రాయదుర్గం వచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

చెక్‌పోస్టు తనిఖీ

రాయదుర్గం : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని డి.హీరేహాల్ మండలం హులికల్లు, కాదలూరు చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం, నగదు తరలింపు వంటి చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలను అడ్డుకోవాలన్నారు. చెక్‌పోస్టులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో 24 గంటలు తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీలు నడుచుకోవాలన్నారు. వ్యక్తిగతంగా నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపాలని కోరారు. ఆయన వెంట రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దవడుగూరు : మండలంలోని కడదరగుట్టపల్లి గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ శ్రీనివాసులు, తహశీల్దార్ శేషరామ్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. కేంద్రాల వద్ద ఓటర్లకు తాగునీరు, విద్యుత్, నీడ వంటి సౌకర్యాలు, తదితర అంశాలపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న పరిస్థితులను తెలుసుకుని ఓటర్లకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసకున్నారు. వారి వెంట రెవెన్యూ అధికారులు సుదర్శనరెడ్డి, రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

నార్పల : సొంత పోలీస్‌స్టేషన్లకు వెళ్తున్న నార్పల స్టేషన్ కి అటాచ్ తో వచ్చి నార్పల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ చలపతి, సురేష్ నాథ్ రెడ్డి, కానిస్టేబుల్ నారాయణ నాయక్, విజయభాస్కర్, దివాకర్ లను సిఐ శ్రీధర్ ఎస్సై రాజశేఖర్ రెడ్డిలో ఘనంగా సన్మానించారు.

బాధితుడికి ఆర్థికసాయం

అనంతపురం కలెక్టరేట్ : పక్షవాతానికి గురై కాలు, చేయి పడిపోయి మంచానికే పరిమితమైన ఆత్మకూరు మండలం, పాపంపల్లి గ్రామానికి చెందిన మాల రామన్నకు ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. నాయకులు గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించడంతోపాటు రూ.40వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుగుమంచి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అహోబిలేసు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఓబిలేసు, నగర అధ్యక్షుడు సుగుమంచి శ్రీనివాసులు, నాయకులు రామన్న, శివలింగమూర్తి, నరసింహులు, కనకరాజ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పెద్దాసుపత్రి పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ నూతనపాటి చిరంజీవి వర్ధంతిని పురస్కరించుకుని తమ్ముడు, ట్రస్టు సభ్యులు కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్బారావు, నబీరసూల్, కిష్టప్ప, ఓబుళపతి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలిసిన సుబ్రమణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, ఆకుపూజ, అర్చన మహానైవేద్యం, మహామంగళహారతి, కుజదోష, కాలసర్పదోష, సర్పదోష నివారణ కోసం మూలమంత్ర బీజాక్షర హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆత్మకూరు : ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ పరమేశ్వరస్వామి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కార్యాలయాలను నిత్యం తెరిచి ఉంచాలన్నారు. రాజకీయ పార్టీ నాయకుల బ్యానర్లు, ఫొటోలను తక్షణమే తొలిగించాలని సూచించారు. ఇందులో భాగంగా ఆత్మకూరు-1 సచివాలయంపై ఉన్న సిఎం జగన్, నవరత్నాల ఫొటోలకు పెయింట్ వేయించాలన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో ఉన్న 14వ శతాబ్దం నాటి పురాతన ఆలయంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి జనసేన మండల అధ్యక్షులు తోట ఓబులేసు ఆదివారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో వివాహాలు జరిగినప్పుడు ఫంక్షన్ హాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలో వారి ఇబ్బందులను గుర్తించి ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. కాగా వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి, బిజెపి కూడా భారీ విజయం సాధించాలని రామలింగేశ్వర స్వామిని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లుమడి గ్రామస్తులు కంబగిరి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.